క్లుప్తంగా

మహా శివరాత్రికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

కుప్పం: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని మల్లప్పకొండకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు కుప్పం డిపో మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం నుంచి 15 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిని కుప్పం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెత్త బుట్టల పంపిణీ



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

రొంపిచెర్ల: చెత్తబుట్టలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి కోరారు. ఆదివారం రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో ప్రజలకు ఆయన చెత్తబుట్టలను పంపిణీ చేసి మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా వేసేందుకు ప్రతి కుటుంబానికి రెండు చెత్త బుట్టలను ఇస్తున్నామని, వీటిలో చెత్తను వేసి గ్రామ పంచాయతీ బండికి ఇవ్వాలన్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి, వర్మీ కంపోస్టు తయారీతో సంపదను సృష్టిస్తామన్నారు. ప్రజలు కూడా ఇంటి, తాగు నీటి పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఈఓ సత్యంరెడ్డి, కార్యదర్శి దశరథ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రుణాల ఇంటర్వ్యూలు

గుడుపల్లె: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు సోమ, మంగళవారాలు స్థానిక వెలుగు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. సోమవారం గుడుపల్లె, సంగనపల్లె, కుప్పిగానిపల్లె, అగరం, యామగానిపల్లె, కనమనపల్లె, చీకటిపల్లె, సోడిగానిపల్లె, పొగురుపల్లె, కొడతనపల్లె, కంచిబందార్లపల్లె, ఓయన్ కొత్తూరు గ్రామాలకు, 25న చిన్నగొల్లపల్లె, దాసిమానిపల్లె, గుండ్లసాగరం, బెగ్గిలిపల్లె, శెట్టిపల్లె, పెద్ద బదినవాడ, నల్లగాంపల్లెల అభ్యర్థులకు సంబంధించి వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేస్తారన్నారు. బ్యాంకులను అనుసంధానం చేశామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ధ్రువపత్రాలను తీసుకురావాలన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచెర్ల: తమ పాఠశాలలో ఆరవ తగరతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సరళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆదర్శ పాఠశాలలోనే ఐదవ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలలో పరీక్షలు ఉంటాయన్నారు. ఏప్రిల్ 20న రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 27న మెరిట్ జాబితా విడుదల చేస్తామన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటు



ట్యాంకు ముందు దాతలు

చౌడేపల్లి: మండలంలోని ఏ.కొత్తకోట సమీపంలోని అగస్తీశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం తాగునీటి కోసం సింటెక్స్ ట్యాంకును ఆదివారం దాతలు ఏర్పాటు చేశారు. అగ్రహారానికి చెందిన అర్చకులు ఆనందాచార్యులు, ఏ.కొత్తకోట ఉపసర్పంచ్ వినోద్‌కుమార్‌రెడ్డి సహకారంతో రూ.25 వేల విలువైన ట్యాంకును ఏర్పాటు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు, గో సంరక్షణ ట్రస్టుకు ఓ దాత ఆదివారం రూ.4.50 లక్షల నగదు విరాళం అందించారు. నెల్లూరు జిల్లాకు చెందిన దాత శ్రీనివాసులు రెడ్డి అన్నదాన ట్రస్టుకి రూ.2.50 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకి రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

హుండీ ఆదాయం లెక్కింపు

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కిస్తామని ఆలయ ఈఓ ఏకాంబరం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ, బ్యాంకు, పోలీస్ సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

చెరువులను చెరబట్టారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆక్రమణ దెబ్బకు చెరువులు కుదించుకుపోతున్నాయి. పైగా బోర్లు సైతం వేసి దర్జాగా పంటల సాగు చేస్తున్నారు! ఇంత జరుగుతున్నా దీనికి పూర్తిగా చెక్ పెట్టి, ప్రభుత్వ చెరువులను పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు అక్రమార్కులకు దాసోహమై, ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక, చెరువు కమిటీల చైర్మన్లు కూడా సేమ్ టు సేమ్ అనే విమర్శలూ వస్తున్నాయి. ఫలితంగా చెరువులు ఆక్రమణలతో బావురుమంటున్నాయి.



పెద్దకొండామర్రి చెరువు స్థలంలో సాగైన టమాట పంట

- యథేచ్ఛగా పంటల సాగు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- పత్తా లేని చెరువు కమిటీ చైర్మన్లు

చౌడేపల్లె: మండలంలో చిన్నకుంటలు, పెద్దచెరువులు కలిసి 248 ఉన్నాయి. వాటిలో ఇటీవల కాలంలో ఏకపక్షంగా తొమ్మిది చెరువులకు సాగునీటి ఎన్నికలు నిర్వహించారు. చెరువుల అభివృద్ధి, పరిరక్షణ వీరి బాధ్యత.అయితే ఇక్కడ దీనికి భిన్నంగా ఉంటోంది. పెద్దకొండామర్రి చెరువు , తుమ్మల చెరువు, కాగతి చెరువు, ఓదులపేట చెరువుతో పాటు చాలా చెరువులు ఆక్రమణల చెరలో ఉన్నాయి. చెరువుల స్థలాలను ఆక్రమించి పంటలు సాగుచేసుకున్నారు. మరికొందరు ఏకంగా పెద్దకొండామర్రి చెరువు స్థలంలో రాతికూసాలు ఏర్పాటు చేసి వరి గడ్డి పందిళ్లు, భూమిను చదువును చేసి భవనాలు నిర్మించడానికి పూనుకున్నారు. డ్రిప్ పైపులు అమర్చి టమాట, కూరగాయలు, పశువులకు సౌకర్యంగా పచ్చిమేత కోసం పశుగ్రాసం సాగు చేస్తున్నారు. మరికొందరు పంటసాగుల కోసం ఏకంగా ట్రాక్టర్ల సహాయంతో దుక్కి దున్ని ఏర్పాట్లు చేస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

అంతా వీఆర్‌ఏల కనుసన్నల్లోనే..!

గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదే. అయితే చెరువుల స్థితి గతులను ఆయా ప్రాంతాల వీఆర్వోలు పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వ ఆస్తులెక్కడ ఉన్నాయి? భద్రమేనా? అని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. అయితే గ్రామాల్లో వీఆర్‌ఏలు ఆక్రమణదారుల నుంచి లంచాలు పుచ్చుకుని ఆక్రమణలకు సహకరిస్తున్నారనే చర్చ సాగుతోంది.

చెరువు సంఘాల చైర్మన్లు ఏమయ్యారు?

ఇటీవల చెరువు సంఘాల చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమవడం విదితమే. చెరువుల అభివృద్ధి, సంరక్షణను పట్టించుకోకుండా వీరు రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మలయ్యారా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. చెరువులు ఆక్రమణల పాలవుతున్నా, చెరువుల్లో ఇష్టానుసారంగా జేసీబీలు, హిటాచీలతో మట్టి, ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం!

మారిన చెరువుల రూపురేఖలు

చెరువుల్లో మట్టిని జేసీబీలు, హిటాచీలతో ఇష్టానుసారంగా తవ్వి తరలిస్తున్నారు. రియల్టర్లు భూములకు తోలి వెంచర్లు వేయడం, ఇటుకల బట్టీలకు తరలిస్తుండడంతో పెద్దపాటి గోతులు దర్శనమిస్తూ చెరువుల రూపురేఖలే మారిపోయాయి. భూగర్భ జలాల మట్టం కూడా పడిపోతోంది. చెరువులను రక్షించాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ హనుమంతునాయక్ వివరణ తీసుకునేందుకు పలు పర్యాయాలు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.





పెద్దూరు వద్ద చెరువులో లోతట్టుగా మట్టిని కోసం తవ్వేసిన దృశ్యం, పెద్దకొండామర్రి చెరువు స్థలాన్ని ఆక్రమించి వేసిన పందిళ్లు, పెద్దకొండామర్రి చెరువులో సాగు కోసం దుక్కి చేసిన దృశ్యం

పలమనేరు బాలాజికి పురస్కారం



అవార్డును అందుకుంటున్న పలమనేరు బాలాజి

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత పలమనేరు బాలాజికి కామాక్షిబాయి, నారాయణరావు స్మారక సాహితీ పురస్కారం ఆదివారం అందుకున్నారు. జిల్లా కేంద్రంలో విజయం విద్యాసంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ రచయిత సీఎస్ చంద్రశేఖర్, డీఆర్వో మోహన్‌కుమార్ చేతుల మీదుగా బాలాజి పురస్కారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ రామలక్ష్మమ్మ, జిల్లేళ్ల బాలాజి, చదువుల బాబు, అరుణకుమారి, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని దంపతులకు గాయాలు

పుంగనూరు: ప్రైవేటు బస్సు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పాలెంపల్లెకు చెందిననరసింహులు (50) తన భార్య శోభారాణితో కలిసి ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. పూజగానిపల్లె వద్ద వారిని ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మను దర్శించుకున్న పెద్దిరెడ్డి, ఆర్కే రోజా



పూజల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు




అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, పూజల్లో ఆర్‌కె రోజా

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం వగళ్లవారిపల్లె సమీపంలో గోటూరి మురళీమోహన్‌రెడ్డి నిర్మించిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ,హోమాలు, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల్లో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సతీమణి స్వర్ణమ్మతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ వారిని సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే, మాజీ మంత్రి ఆర్‌కే రోజా సైతం ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై నుంచి పడి మహిళకు గాయాలు

పుంగనూరు: ఇంటి పైనుంచి కింద పడి మహిళ గాయపడిన సంఘటన ఆదివారం పుంగనూరులో చోటుచేసుకుంది. స్థానిక ఎన్ఎస్ పేటలో నివాసం ఉంటున్న మంజుల (42) ఇంటి మిద్దెపైకి వెళ్తూ జారి మెట్లపై నుంచి కింద పడి గాయపడింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్ణాటకలోని జాలప్ప ఆసుపత్రికి తరలించారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే



క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న టీచర్లు

గుడుపల్లె: విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచి విద్యతో పాటు క్రీడలూ ఎంతో అవసరమని సంగనపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జనార్దన్‌రెడ్డి అన్నారు. వార్షిక క్రీడా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ఖో-ఖో, వాలీబాల్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించారు. వి.కోటలోని వీబీపీ ఇండోర్ స్టేడియం నిర్వాహకుల సౌజన్యంతో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రతి ఒక్కరూ చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుడు వేణుగోపాల్, టీచర్లు పాల్గొన్నారు.

మాయపై జాగృతితో జ్ఞానం

గంగవరం: శివరాత్రి జాగరణ అంటే మాయపై జాగృతి కలిగి జ్ఞానం పొందడమేనని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఇంటింటా హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా మండలంలోని దండపల్లెలో ఆదివారం భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి పండుగ విశిష్టత గురించి తెలియజేశారు. శివరాత్రి రోజున జాగరణ చేస్తే మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు భాస్కర్, రాజేంద్ర, రెడ్డెమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

ప్రశాంతంగా దూడల మైలేరు



పాతపేటలో నిర్వహించిన మైలేరులో పరుగులు తీస్తున్న దూడ

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతపేటలో ఆదివారం దూడల మైలేరు పండుగ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6 గంటలకే గ్రామ నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దూడలను తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరువైపులా కొయ్యలతో ఏర్పాటు చేసిన అల్లెలో దూడలను తీసుకువచ్చి పరుగుపందెంలో వదిలిపెట్టారు. దూడలకు సినీనటుల పేర్లు, జంతువుల పేర్లు, రాజకీయ నేతల పేర్లు పెట్టి వదిలి పెట్టడంతో యువత ఉత్సాహంగా వాటిపై చేయి వేయడానికి ప్రయత్నించారు. దూడలు భారీ సంఖ్యలో రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మైలేరు పండుగ నిర్వహించారు. మండుటెండలను సైతం యువత లెక్క చేయకుండా దూడలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. మైలేరులో గెలుపొందిన దూడలకు సంబంధించి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు.

అగస్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు


- మార్చి 3 వరకు ఉత్సవాలు
- వస్త్రాలు సమర్పించనున్న పెద్దిరెడ్డి



నెక్కుంది శ్రీ అగస్తీశ్వరస్వామి



నెక్కుంది వద్ద ఉన్న శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయం



అగస్తీశ్వరస్వామి ఆలయంలో నిర్మించిన పుష్కరిణి

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామ పంచాయతీ కొండలపై ఉన్న శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయానికి దక్షిణకాశీగా పేరు పొందింది. అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన ఈ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తారు. 28న రథోత్సవానికి వేల సంఖ్యలో భక్తులు హాజరై, రథంపై ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లిస్తారు. శివరాత్రి రోజున ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అలాగే పట్టణంలోని యాభై రాళ్ల మొరవేశ్వరుడు, కోనేటి వద్ద శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, ప్యాలెస్‌లోని సోమేశ్వరాలయం, భీమగానిపల్లెలోని భీమేశ్వరాలయం, కీలకీరిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పూజలకు సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ దీపాలు, మామిడి ఆకులు, బిల్వపత్రి తోరణాలతో ఆలయాల్లో పూజలు చేశారు.

ఆలయానికి నూతన శోభ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అప్పటి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పురాతన ఆలయమైన శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయాభివృద్ధికి సుమారు రూ.10 కోట్లను కేటాయించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. అలాగే పుష్కరిణిని సుందరంగా తీర్చిదిద్దారు. వీటితో పాటు కళ్యాణ మండపం, గదులు నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సిమెంటు రోడ్లు వేశారు. నెక్కుంది నుంచి కొండపైకి సుమారు మూడు కిలోమీటర్లు తారు రోడ్డు వేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో పురాతన ఆలయం సరికొత్త సొబగులతో భక్తులను ఆకర్షిస్తోంది.

ఆలయ చరిత్ర

ఆలయానికి ఓ వైపు నుంచి కొండపైకి చక్కటి ఎక్కుడు దారి ఉంది. చోళరాజుల పాత రాజధాని నగరం (జయకొండ చోళపురము) కొత్తకోటకు, కొండకు మధ్యగల స్థలంలో ఉండేది. ఇక్కడ పొలాల్లో దీనికి రుజువులు కూడా ఉన్నాయి. దాదాపు ఒక కిలోమీటరు పొడువు అంతే వెడల్పు ఉన్న విశాల స్థలంలో ఎన్నో శిథిలాలయాలు, 50 అడుగుల ధ్వజ స్తంభం, ప్రాచీన సమాధులు ఉన్నాయి. అగస్తీశ్వరాలయం కొండశిఖరాగ్రాన విశాలమైన ప్రదేశంలో నిర్మించారు. ఇక్కడ ఈశ్వరుడు ప్రధాన దైవం, అగస్త్య మహాముని పూజించిన శివలింగాన్ని ఇక్కడ రాజులు తెచ్చి ప్రతిష్ఠించారని, అందుకే ఈ ఆలయానికి అగస్తీశ్వరాలయమని పేరు వచ్చిందని ప్రతీతి. భూలోక సంచార సమయంలో స్వయంగా స్వామిని ప్రతిష్ఠించారని కూడా మరో ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఈ కొండకు మూడు వృత్తాకారపు కోటలున్నాయి. ఇది ఒకప్పుడు గిరి దుర్గంగా ఉండేది. రెండు కొండలకు మధ్య భాగాన కోనేటికి వాయువ్యంగా పాతనిర్మాణాలు, రోలు దిమ్మెలు, నిర్మాణ సామగ్రి శిథిలమై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. నగిరిండ్లనే గృహ నిర్మాణాలు ఉండేవని కొందరు తెలిపారు. ఆలయం చుట్టు నాలుగు దోనలున్నాయి. వీటిలో ఎల్లప్పుడూ నీళ్లు ఉంటాయి. చిన్న చిన్న 5 కొండగుట్టలపై 14 మలుపులు గలిగిన రహదారి వేశారు.

ఆలయంలో..

గర్భగుడిలో అగస్తీశ్వరస్వామి ఉన్నారు. కొండపై సుబ్రమణ్య ఆలయం, వినాయకాలయం, చౌడేశ్వరి, పార్వతి ఆలయాలు ఉన్నాయి. కాశీవిశ్వేశ్వరాలయం, చండీశ్వరాలయం, వీరభద్రాలయం, భద్రకాళి ఆలయాలున్నాయి. ప్రదక్షిణ మండపం శిల్పకళతో కూడిన స్తంభాలపై ఉంది. తమిళ, తెలుగు శాసనాలు అనేకం ఉన్నాయి. మొదటి శాసనం క్రీ.శ 1192 -1193 నాటి మొదటి కుళోత్తుంగ వీరరాజేంద్రుడిది. తరువాత క్రీ.శ 1329లో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన గంగవంశరాజై (ఉత్తమచోళ గంగపుడమి దేవకుమారుడు) సెల్వగంగరాజు, అతని పట్టమహిషి సెల్వగంగ విగ్రహ ప్రతిష్ఠగావించినట్లు..మరో శాసనంలో స్వామికి స్వర్ణాభరణాలను సమర్పించినట్లు, ఇంకొక శాసనంలో ఆలయ నిర్వహణకు ప్రకటించిన మాన్యాలు ఉన్నాయి.



సదుం: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

నివాళి

సదుం: ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఆనంద దశదిన కర్మలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ జబ్బార్ సాహెబ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, నిహాంత్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహమ్మద్ ఆలీ తండ్రి షేక్ మహమ్మద్ గౌస్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం దశ దిన కర్మ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.